కథానిక

# కళ్లు తెరచిన అదృష్టం

"జ్యేష్ఠ"

"అక్కయ్యా! ఇంటర్వ్యూకి రెడీగా ఉండు. ధరోగా ప్రిపేరయ్యావా?" తమ్ముడు అతి సీరియస్‌గా హెచ్చరించాడు. వాడికి ఈ తతంగం చూస్తుంటే లోపల మండుకొస్తోంది. కాని వాడి మొహంలో కొంటెతనం అలానే ఉంది. నేను క్రింది పెదవి పళ్ళక్రింద నొక్కిపెట్టి అద్దంలో చూస్తుండటం గమనించి తమ్ముడు అడిగాడు. "యూనిఫారం సరిగా ఉందా లేదా?" 'ఏడిశావులే కోతివెధవా. నువ్వు నోరు మూసుకో" నాన్నగారన్నారు. తమ్ముడు సినిమాలు తెగచూసి రాత్రిళ్లు పలవరించడం చూసి వీడు కూడా 'వాళ్ళ'లో కలిసిపోతాడనే అమ్మకూడా "నాన్నా! ఇది తీసుకుని సినిమాకి పో" అని రూపాయిస్తుంది—వీడి శని ఒదులుతుందనే ఆశతో. వాడు ఇంట్లోనే ఉంటానంటాడు. "అక్కయ్యా? పత్రికల్లో "కట్నాల మార్కెట్" అనే కాలంవేసి 'వేరుశనగ 156 పౌన్లు. సంచీతో సహా' అన్నట్లు బి. ఏ. అయిదువేలు లాంఛనాలతో సహా అని వేస్తే" అని తమ్ముడు అంటూంటే నాన్నగారు తరుముకు తరుముకొచ్చారు చావకొడదామని. అమ్మ వాడి పీపుకు యథారీతిని ఉండనిమ్మని నాన్నగారిని వేడుకొని "వేణూ! అక్కకి పెళ్ళవాలని లేదట్రా? చూడవచ్చినవాళ్ళు మూడువంతులు నీ వాగుడు వినే తిరిగిపోయి ఉంటారు" అంది. "అయితే నా జన్మ తరించినట్లే" అని ప్రక్కగదిలోకి జాయాడు వాడు. అల్లుడుకోసం నాన్నగారు తపస్సుచేస్తూనే ఉన్నారు ఆరేళ్ళ క్రితం 'ఆ రోజు' నుంచీని. కాని నా పెళ్ళిమాత్రం ఎండమావుల్లా కేలెండర్లు నడచినకొద్దీ దూరమౌతోంది. పద్ధెనిమిదిమంది యువకులు ప్రత్యక్షమై నాన్నగారిచ్చే నైవేద్యం చాలదని గుసుస్తూ నిష్క్రమించారు. పెళ్ళిచూపుల టైములో నాకెంతో చిరాగ్గానూ చిన్నతనంగానూ ఉండేది. మా తమ్ముడు మాత్రం చాలా వినోదం పొందేవాడు. "దీనిముందు ఛార్లీ చాప్లిన్ (అతని హాస్యం వెనక ఏడుపుదాగి ఉంటుందంటారు) పిక్చర్ బలాదూర్. అక్కయ దీనికెలా ఛాన్స్ చెప్పాలో తెలియడంలేదు" అ వాడు 'వాళ్లు' గుమ్మాలు దిగుతూ ఉండగా. నాన్నగారికీ, అమ్మకీ అగ్నిపర్వతంమీద కూర్చున్నట్టుండేది. అగ్నిపర్వతంపైకి పచ్చగా బాగానే ఉంటుంది. కాని అది ఏ క్షణంలోనైనా పేలవచ్చు. అలా పద్ధెనిమిది అగ్నిపర్వతాలు పగిలినా పద్ధెనిమిదేళ్ళవయస్సును మరింత బరువుగా చేశాయి. నిరుత్సాహం లావాతో గుండెలమీద కుంపటివేడి గడియారం నడిచేకొద్దీ ఎలా దుస్సహంగా తయారౌతుందో అలాగే నా వివాహసమస్య కాలంతో కఠినతరం, బాధాకరం కాజొచ్చింది కానిఅమ్మా నాన్నగారూ పైకి బాధపడేవారు కాదు నా మనశ్శాంతి కోసం.

"పెళ్ళిచూపులకు వచ్చినవాళ్లు ఉండాలనే క్వాలిఫికేషన్లలో సగం ఉంటే ప్రపంచంలో ఏ విద్యాలయంలోనైనా నాకు సీటు దొరుకుంది" అంటాడు తమ్ముడు అందులో అతిశయోక్తి బహుకొద్ది. ఒకాయన "ఈదడం ఒచ్చా అమ్మాయికి?" అని అడిగేడు. మరొకాయన "అమ్మాయి బరువెంత?" అని అడిగి "నూరు పౌన్లు ఉండి తీరాలి." అన్నాడు పళ్ళుబిగించి. మరొకాయనకి "కోరస్‌లో గొంతు కలపగల గాయకి" మాత్రమే భార్య అయే అర్హతకలిగి ఉంటుందిట. కాని అందరికీ కలిపి ఒక కోరిక ఉంది. అది "కట్నం"

అలా ఆలోచనలో మునిగి ఉండగా "అమ్మాయిని ప్రవేశపెట్టండి" అని వినపడింది. "ఈసారి ఎలా ఉందో నీ అదృష్టం" అని అమ్మ చీర చెంగుతో కళ్లొత్తుకుంది. నేను నదురూ బెదురూ లేకుండా గదిలో అడుగుపెట్టాను. గదిలో బల్లమీద 'వాళ్లు'

సగం ఖాళీచేసిన కప్పులూ ప్లేట్లూ ఉన్నాయి చాపమీద కూర్చున్నాను.

సామాన్యంగా జరిగే దేమంటే అబ్బాయికి అమ్మాయి నచ్చి తీరాలి, అతను నిజానికి పెళ్లాడేది డబ్బునే ఐనాను. కాని అమ్మాయికి అబ్బాయి నచ్చాలని లేదు. అతను సాక్షాత్తూ హనుమంతుని మేనల్లుడైనా,రంగులో'కృష్ణమూర్తి' ఐనా అమ్మాయి నోరెత్తడానికి వీల్లేదు. నోరెత్తడానికి పెళ్ళిచూపుల్లో తల ఎత్తితే కదూ! నేనూ ప్రారంభంలో తల ఎత్తాలని ఉన్నా, ఎత్తడానికి భయంలేకపోయినా సాంప్రదాయానికి తల ఒంచే దాన్ని. అతను నన్ను చూడడానికి వచ్చిన అతను పేరు 'శంకర్' రెప్పవాల్చకుండా గోడవైపు చూస్తున్నాడు. నాన్నగారు అతని తండ్రిముఖకవళికలు నన్ను చూశాక ఏలా మారాయో పరీక్షిస్తున్నారు. ఆయన అంటే శంకర్ తండ్రి ఎత్తైన తన కోటుజేబు (అందులో పర్సుంది) నిమురుతున్నాడు "ఆ బొమ్మ చాలా బాగుంది. ఎవరు వేశారు?" 'అతను' అడిగాడు. 'అక్కయ్య' అన్నాడు తమ్ముడు. అతనేమనుకున్నాడోగాని 'ఆయన' మాత్రం చాలా చిరాకు పడ్డారు 'ఇది' చూసి.

"అమ్మాయి పేరేమిటండి?" 'ఆయన' ఎదురుగా తెల్లటిగోడని అడిగారు. గోడతరఫు వకాల్తా వాళ్ళు తీసికోనే లోగానే నేనే చెప్పేశాను. "శశికళ." (సినీతార పేరు. నా అసలుపేరు 'శశి') ఆయన నోరు తెరిచాడు చేపలాగా, వింతగా నాకేసిచూచాడు. "స్త్రీ సాహసం!" అన్నట్లుగా. ఆయన నాన్నగారికేసి తిరిగి "సంగీతం చెప్పించారా?" అని అడిగేరు. నాన్నగారు భయపడుతూనే చెప్పారు "లేదండి. ఏవో సినీమా పాటలు పాడుతుంది." 'ఆయన' పెదిమ విరిచారు. "మంచి పని చేశారు." అన్నాడు 'అతను.' అందులో ఏం వెటకారం ధ్వనించిందో నాన్నగారు తలవంచుకొన్నారు. "అమ్మాయి కంఠంలోనే సంగీతం ఉంది" అని 'ఏమంటావ్' అన్నట్టు నాకేసిచూశాడతను. నేను తలవంచుకున్నాను. 'ఆయన'కి 'అతని' సహృదయత కిట్టలేదల్లే ఉంది లేచినుంచున్నాడు. 'అతను' కూడా లేస్తూ అన్నాడు "అమ్మాయికి ముదురు రంగులు ఇష్టమా? తల ఇంక కొద్ది గట్టిగా దువ్వితే జుత్తు ఊడుతుందేమో!" నా ఆశలు కూలిపోయాయి. నాన్నగారూ, 'అతనూ,' 'ఆయనా' నాతో పనిలేని, పెళ్ళికి అతి ముఖ్యమైన విషయాన్ని గురించి మాట్లాడుతున్నారు.

నేను లేస్తూంటే జ్ఞాపకం వచ్చింది.—నేను ఇంటర్ చదివే రోజుల్లో 'అతను' బి. ఎస్. సి. లాబరేటరీలో కనపడేవాడు. నాకు ఏడుపు ముంచుకొచ్చింది. అతను నాజడ, చీరలగురించి అన్న మాటలు అంత సూటిగా తగిలేయి. అది ముదురు నీలంరంగు పట్టుచీర, జానెడు జరీ అంచూ అదీని. అదంటే నాకు పరమఅసహ్యం. ఏంచెయ్యను? పట్టుచీర కట్టాలని అమ్మ పట్టుదల. ఉన్న చీరల్లో దానిది లేతరంగు! మామూలుగా నాజుట్టు ఒదులుగా చిన్న చిన్న ఒంపులతో ఉండేది. ఈరోజున ప్రత్యేకం గంటసేపు జడవేసింది అమ్మ జుత్తునొప్పిపెట్టేటంత నున్నగాదువ్వి వాళ్ళకి నేను నచ్చలేదంటే అమ్మ 'మనఖర్మ' అంటుంది. అవును దీనికి మనమే కర్తలం బయట ఎంత అందంగా కనపడే అమ్మాయైనా ఈలాంటి అలంకరణతో భయంకరంగా తయారౌతుంది. పెంపుడుపిల్లి పెద్దపులిలా తయారౌతే, పెద్దవాళ్ళని ఏమనాలి? కసితీరా ఏడిచేశాను- నాలుగు గంటలదాకా.

బయట 'అతని' గొంతుక వినపడింది. "అబ్బే మూడువేలైనా లేకుంటే ఏలా?" నాకు మళ్ళీ ఏడుపొచ్చింది. కట్నాలు కూడదని కాలేజీ స్టేజిమీద గర్జించిన శంకర్ ఇప్పుడు పరిస్థితుల బానిస! "నలుగురితోపాటు నారాయణా"అని 'ఆయన' తృప్తిగా నవ్వారు. ఒకప్పుడు కట్నాలు పనికిరావన్న తన పుత్రరత్నం ఇప్పుడు తండ్రి మాట ప్రకారం తనకు నచ్చిన పిల్లని కట్నం లేదని తన్ని పారేస్తుంటే ఆయనకు తృప్తిగాక మరేమిటి? 'ఆయన'కు ఈపాటికి బోధపడి ఉంటుంది. నాన్నగారు మూడువేలు కాదుకదా మూడువందలైనా ఇవ్వలేరని. ఆ ధీమాతో "యం. యస్సి. ప్యాసైనా మూడువేలకి చేసుకుందుం. పిల్లనచ్చింది కూడాను"అన్నాడు. నాకు మహా ఒళ్ళుమండింది. పిల్ల ఆయనకు నచ్చితే చాలు 'అంతా తరిస్తాం' అనుకుంటున్నట్టు.

అదే నా ఆఖరి 'ఇంటర్వ్యూ'. అలిసిపోయిన నాన్నగారు అల్లుళ్ళ అన్వేషణ విరమించుకున్నారు. నేను ఇంటర్ పేసయ్యానుకదా అనే ధీమా ఉంది నాకు. అమ్మే అప్పుడప్పుడు ఏడుస్తూ ఉండేది. అలా రెండేళ్ళు గడిచాయి.

* * *

అది ఒక ఎండిన మొండిమధ్యాహ్నం మూడు గంటలౌతుంది. షేక్స్పియర్ పారాయణ చేస్తున్నాడు తమ్ముడు. గుమ్మంలో రిక్షా ఆగింది. తమ్ముడు వీధిలోకివెళ్ళి 'శంకర్'అని అరిచి 'రండి' అన్నాడు. 'అతనో' లెదరుబాగ్‌తో లోపలికొచ్చి కుర్చీలో కూలపడుతూనే అడిగాడు "మీ అక్కకి పెళ్ళయిందా?" తమ్ముడు అవలేదన్నాడు. అతను కుదుటపడి "అమ్మయ్య!" అనేమో గొణిగాడు. ఏమిటీ అతని ఉద్దేశం? నాకు జన్మలో పెళ్ళికారాదని అతని కోరికా? తమ్ముడు నాన్నగారిని తీసుకొచ్చాడు ఆఫీసునుంచి. నాన్నగారు అతనెవరో జ్ఞాపకంచేసుకొంటున్నారు. "నువ్వటోయ్! అంతా కులాసా?"అన్నారు కళ్ళజోడు కొద్దిగా పైకెత్తి. అతను అంతా కులాసా అని చెప్పాడు.

'నాకు వివాహం జరగబోతోంది. మీరందరూ రావాలి"అతను నన్ను క్రీగంట చూస్తూ అన్నాడు. ఏమి బంధుత్వం ఉందని?

నాన్నగారు "మేమెందుకులే" అన్నారు నిరుత్సాహంగా. అసలు కోపంరావలసిన విషయం. 'తనకు అల్లుడు కావలసినవాడు మరొకరి పిల్లని....'

"మీరు లేకుండా పెళ్ళెలా జరుగుతుంది?" అతను నవ్వుతూ అన్నాడు. వెటకారమా? లేక మతిలేకనా?

నాన్నగారుకూడా నవ్వుతూ "ఎప్పుడు పెళ్ళి?" అని అడిగారు.

"అది మీ వీలునుబట్టి ఉంటుంది"అనన్నాడు. నిజంగా మతిపోయింది కాబోలు! నాన్నగారికి విసుగెత్తుతోంది "అదేమిటి?"అన్నారు. అతను నాన్నగారి మొహంలోకి చూస్తూ "క్షమించండి. మీ అమ్మాయిని నాకిచ్చి......"అన్నాడు.

ఎండకు నల్లబడిన నాన్నగారి మొహం ఒకమారు మెరిసి తిరిగి నల్లబడింది. "నువ్వు అల్లుడివవడం చాలా అదృష్టం. కాని కట్నం..." అంటూంటే అతనన్నాడు "కట్నం మూడువేలూ ఇవ్వవలసిందే. నాకిప్పుడు నెలకి ఐదువందలుజీతం. మా నాన్న ముప్ఫైవేలు అడిగేవాడే. కాని ఆనాడు ఇక్కడే అన్నాడు "మూడువేలిస్తే చేసుకుందుం అని మా నాన్న మీ విషయంలో మూడువేలు ఒప్పుకుంటాడు మాటతప్పని మనిషి కనుక.

"ఎక్కడలేము! మాకు ఎవరూ అప్పుకూడా ఇవ్వరే.."నాన్నగారన్నారు. మెట్లులేని మేడమీద బంగారాన్నిచూసి గుటకలుమింగే మనిషి అవస్థ తలంపుకొచ్చింది.

అతను—కాదుకాదు—ఆయన నవ్వుతూ బాగ్ తెరచి, నోట్లకట్ట ఒకటి తీసి "ఇదిగో అప్పు. రెండేళ్ళు కష్టపడి సంపాదించిన నాలుగు వేలు. వెయ్యి పెళ్ళి ఖర్చులకి మిగిలింది కట్నం ఇక అప్పు తీర్చడం అంటారా? మీ అమ్మాయి గుణగణాలు. అందచందాలు, తెలివితేటలు అంతకు పదిరెట్లు ఎక్కువచేస్తాయి. నే నిప్పుడే మా నాన్న వద్దకు వెళ్తున్నా. ముహూర్తం నిర్ణయించేక రెండు మూడు రోజుల్లో వస్తాను" అంటూంటే తమ్ముడిని చూసితీరాలి. వాడెంత బుద్ధిమంతుడు అయ్యాడు!

అమ్మ కాఫీ తెస్తానని వెళ్ళింది. నే నాలోచిస్తున్నాను. ఈయన, కాబోయే 'మావారు' నా అందచందాలు ఇత్యాదుల్ని ఉపేక్ష చేశారు. "అబ్బే .. లేదు. నిజంగా ఆయనకి నే నలా కనపడకపోతే ఇంత శ్రమ ఎందుకుపడ్డారు?" అని సమాధానపరుచుకున్నాను.

ఆయన నా చేతిలో కాఫీ అందుకుంటూ నా ఒదులు జడా, లేతరంగు చీరా తనివితీరా చూసి నా మొహంలోకి నవ్వేరు.

